ఉలిక్కిపడిన కొత్తపేట పీఎస్

- వరుస ఘటనలతో భయాందోళనలు
- ఒంటరి మహిళలే టార్గెట్‌గా దాడి
- యువతీ యువకుడిని బెదిరించి దోపిడీ
- యాసిడ్ దాడి చేస్తానని మహిళకు బెదిరింపు
- కొత్త సీఐకు సమస్యలతో స్వాగతం


కొత్తపేట పోలీస్‌స్టేషన్

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): కొత్తపేట పోలీస్‌స్టేషన్.. విజయవాడ నగరానికి పరిచయం అవసరం లేని పీఎస్... నగరంలో అత్యధిక కేసులు నమోదు అయ్యే పోలీస్ స్టేషన్లలో కొత్తపేట పోలీస్‌స్టేషన్ ఒకటి. ఇక్కడ పని చేయడమంటే కత్తి మీద సామే. ఇక్కడ విధులు నిర్వహించిన ఎస్‌ఐలు, కానిస్టేబుళ్లు రాష్ట్రంలో ఎక్కడైనా పని చేయగలుగుతారనే ప్రచారం ఉంది. ఇక్కడ సిబ్బందితో సమన్వయం చేసుకుని కేసులు పరిష్కరించడం ఎస్‌హెచ్‌ఓకు సవాలేనని చెప్పాలి. మూడు నియోజకవర్గాల్లోని కీలక ప్రాంతాలతో పాటు నగరంలోని పేదలు అత్యధికంగా నివసించే కొండ ప్రాంతాలు ఉన్న పోలీస్ స్టేషన్.. గత కొంత కాలంగా నిశబ్దంగా ఉన్న పోలీస్ స్టేషన్ గత పది రోజుల్లో వరసగా జరుగుతున్న ఘటనలో ఒక్కసారిగా ఉలిక్కి పడింది. స్టేషన్‌లో గతంలో ఎన్నడూ లేని విధంగా ఒంటరి మహిళలపై దాడి చేసి బంగారం దోచుకోవడం. యువతీ యువకుడిపై దాడి చేసిన ముగ్గురు యువకులు వారి నుంచి సెల్‌ఫోన్లు, నగదు దోచుకోవడం విస్మయానికి గురి చేసింది.

రికార్డు స్థాయిలో కేసుల నమోదు

ఎన్నికల ముందు స్టేషన్‌కు బదిలీపై వచ్చిన తిప్పా గణేష్ తాజాగా జరిగిన బదిలీల్లో ఏలూరు రేంజ్‌కు బదిలీ అయ్యారు. కొత్త సీఐను నియమించలేదు. త్వరలో కొత్తపేట సీఐను నియమించే అవకాశం ఉందని పోలీసు వర్గాల్లో ప్రచారం జరుగుతుంది. కొత్త సీఐకు వరసగా చోటు చేసుకుంటున్న ఘటనలు స్వాగతం పలుకనున్నాయి. కొత్తపేట పోలీస్ స్టేషన్‌లో సాధారణంగా భార్యభర్తల గొడవలు, మిస్సింగ్ కేసులే అధికం. అయితే గతంలో ఎన్నడూ లేని విధంగా దారి దోపిడీలు, ఒంటరి మహిళలను బెదిరించి, దాడులకు పాల్పడి బంగారం దోచుకున్న ఘటనలు జరిగాయి. దాడులకు పాల్పడిన వారిని ఎప్పటి లోగా పట్టుకుంటారనేది ప్రజల నుంచి వస్తున్న ప్రశ్న.

అధికమైన బైక్, పెట్రోల్ చోరీలు

స్టేషన్ పరిధిలోని కొండ ప్రాంతాల్లో ఇటీవల బైక్, పెట్రోల్ చోరీలు అధికమయ్యాయి. కొత్తపేట, వించిపేట, గొల్లపాలెంగట్టు, నైజాంగేటు, చిట్టినగర్, వాగుసెంటర్, పాలప్రాజెక్టు, భీమన వారి పేట కొండ ప్రాంతాల్లో నివసించే ప్రజలు తమ వాహనాలను కొండ దిగువన పార్కింగ్ చేస్తుంటారు. ఇలా పార్కింగ్ చేసిన బైక్‌ల నుంచి పెట్రోల్ చోరీ చేయడంతో పాటు అడపా దడపా బైక్‌లను సైతం చోరీలకు పాల్పడుతున్నారు. గతంలో రాత్రి 12 గంటల తర్వాత రోడ్లపై ఎవరైనా కనిపించినట్లయితే గస్తీ తిరిగే పోలీసులు వారి వివరాలు పూర్తిగా తెలుసుకున్న తర్వాతే పంపేవారు. గత కొంత కాలంగా అర్ధరాత్రి బైక్‌లపై ఇష్టానుసారంగా తిరుగుతున్నా పట్టించుకునే వారే లేకపోయారు. దీంతో అర్ధరాత్రి ఆటోల్లో, జన సంచారం తక్కువగా ఉండే వీధులను అడ్డాగా చేసుకుని ఆకతాయిలు రెచ్చిపోతున్నారు. మహంతిపురం పరిధిలో నివసించే ఓ మహిళను ప్రేమించానని కొంత కాలంగా ఓ వ్యక్తి వెంట పడుతున్నాడు. తన వెంట పడవద్దని ప్రాధేయ పడిన మహిళ నుంచి మాయమాటలు చెప్పి డబ్బులు తీసుకున్నాడు. అయినా ఆ మహిళ వెంట పడటం మానకపోగా, నీళ్ల బాటిల్ తెచ్చి ముఖంపై పోసి ఇదే యాసిడ్ అనుకో.. నా మాట వినకపోతే ఈ నీళ్లే యాసిడ్ అవుతుందని హెచ్చరించాడు. దీంతో మహిళ పోలీసులను ఆశ్రయించింది.

సమస్యాత్మకంగా ఇన్నర్ రోడ్డు

కొత్తపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని విజయవాడ రూరల్ ప్రాంతాలు తలనొప్పిగా మారాయి. ముఖ్యంగా వైఎస్సార్ కాలనీ, పైపుల రోడ్డు నుంచి కాలనీ ఇన్నర్‌రోడ్డు, జక్కంపూడి 60:40 స్థలాలను అడ్డాగా చేసుకుని ఆకతాయిలు రెచ్చిపోతున్నారు. తాజాగా మూడు రోజుల కిందట కందులపాడుకు వెళ్తున్న యువతీ, యువకుడిని పోలవరం కాల్వ వద్ద ముగ్గురు వ్యక్తులు బెదిరించి రెండు సెల్‌ఫోన్లు, రూ.500 నగదు దోచుకున్నారు. గతంలోనూ ఇదే ప్రాంతంలో ఇటువంటి ఘటనలు చోటు చేసుకున్న సందర్భాలు ఉన్నాయి. అయితే ఈ ప్రాంతంలో పోలీసుల నిఘా లేకపోవడంతో ఆకతాయిల ఆగడాలకు అడ్డే లేకుండా పోయింది. మరో వైపున ఇన్నర్ రోడ్డులో వాహనాలను నిలుపుకుని నిద్రపోయే లారీ డ్రైవర్లపై దాడులు పెరిగాయి. లారీ డ్రైవర్లపై దాడులకు పాల్పడిన ఘటనలపై కేసులు నమోదు చేయడం మినహా నిందితులను అదుపులోకి తీసుకున్న సందర్భాలు లేవని నియోజకవర్గ ప్రజలు వాపోతున్నారు.

17న నృత్యనీరాజనం

విజయవాడ కల్చరల్: శ్రీ వాగ్దేవీ కూచిపూడి నృత్యాలయ ఆధ్వర్యంలో 17వ తేదీ శనివారం గాంధీనగర్‌లోని హనుమంతరాయ గ్రంథాలయంలో నృత్య నీరాజనం – 2024 కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు నాట్యాచార్య సప్పా శివకుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 12 గంటల పాటు జరిగే కార్యక్రమంలో గురుసత్కారంతో పాటు ప్రతిభ చూపిన కళాకారులకు శ్రీ వెంకటేశ్వర, బసవ నంది పురస్కారాలతో సత్కరిస్తామన్నారు. ప్రత్యేక కార్యక్రమంగా కూచిపూడి సిద్ధేంద్రయోగి కళాపీఠం విశ్రాంత ఆచార్యులు డాక్టర్ వేదాంతం రామలింగ శాస్త్రిని ఘనంగా సత్కరిస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి కలిగిన నృత్య కళాకారులు 970 107 7636 నంబరులో సంప్రదించాలని కోరారు.

10న భవానీపురంలో జాబ్ మేళా

భవానీపురం(విజయవాడపశ్చిమ): సుజనా ఫౌండేషన్, నేషనల్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 10న భవానీపురంలోని ఎన్డీఏ కార్యాలయంలో నిర్వహించనున్న జాబ్ మేళాను నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని బీజేపీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు అడ్డూరి శ్రీరామ్ సోమవారం ఒక ప్రకటనలో కోరారు. పశ్చిమ నియోజకవర్గం ఎమ్మెల్యే వై.సుజనా చౌదరి ఆదేశాల మేరకు టెక్ మహీంద్రా, అరబిందో ఫార్మా, రిలయన్స్ జియో, బిగ్ సీ, బిగ్ బాస్కెట్, ఐసీఐసీఐ బ్యాంక్, అపోలో ఫార్మసీ, నవత ట్రాన్స్‌పోర్ట్ వంటి అనేక బహుళ జాతీయ కంపెనీల ప్రతినిధులు హాజరై ఇంటర్వ్యూలు చేస్తారన్నారు. పదో తరగతి, ఇంటర్, డిగ్రీ, పీజీ, డిప్లొమో, ఇంజనీరింగ్ చేసిన అభ్యర్థులు సంబంధిత సర్టిఫికెట్లు, బయోడేటా, ఆధార్, పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలతో హాజరు కావాలని సూచించారు. పూర్తి వివరాలకు 70323 99488, 90004 12345 నంబర్లలో సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు.

క్లుప్తంగా

వేణు సుదర్శికి సత్కారం



మధురానగర్(విజయవాడసెంట్రల్): ఉద్యోగుల సమస్యలపై రాజీలేని పోరాటం చేస్తున్న ఏపీ శాక్స్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు వేణు సుదర్శిని సోమవారం యూనియన్ జిల్లా కమిటీ ఆధ్వర్యాన ఘనంగా సత్కరించారు. నగరానికి విచ్చేసిన ఆయనను ఏఆర్‌టీ సెంటర్ వైద్యాధికారి డాక్టర్ గౌతం అంబేడ్కర్ శాలువా కప్పి అభినందించారు. ఈ సందర్భంగా గౌతం అంబేడ్కర్ మాట్లాడుతూ.. అహర్నిశలు ఉద్యోగుల సంక్షేమం కోసం పోరాడుతున్న వేణును ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకుని పనిచేయాలని సూచించారు. వేణు సుదర్శి మాట్లాడుతూ ఉద్యోగులు సంఘటితంగా ఉండి హక్కులను పరిరక్షించుకోవాలని సూచించారు. ఉద్యోగులకు ఏ సమస్యలు వచ్చినా యూనియన్ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకట సుబ్బయ్య, జిల్లా కమిటీ అధ్యక్షులు మెడబలిమి భాస్కరరావు, మేరుగ ప్రీతి, రాష్ట్ర కార్యవర్గం నాయకురాలు అపర్ణ, ఏఆర్‌టీ సెంటర్ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థినికి దీవెన ఫౌండేషన్ ఆర్థిక సాయం



భవానీపురం(విజయవాడపశ్చిమ): చదువుకునేందుకు పేదరికం అడ్డంకిగా మారి ఇబ్బందులు పడుతున్న విద్యార్థినికి నగరానికి చెందిన దీవెన ఫౌండేషన్ ఆర్థిక సాయం అందజేసింది. సెంట్రల్ నియోజకవర్గం అజిత్‌సింగ్‌నగర్‌లో ఎనిమిదో తరగతి చదువుతున్న కోట సౌమ్యకు తల్లిదండ్రులు లేకపోవడంతో సింగ్‌నగర్ గంగానమ్మ గుడి వద్ద నివసిస్తున్న నాయనమ్మ దుర్గమ్మ దగ్గర ఉంటోంది. కూలి పనులు చేసుకుంటూ మనుమరాలిని పోషిస్తూ చదివిస్తున్న దుర్గమ్మ సహాయం కోసం దీవెన ఫౌండేషన్ స్వచ్ఛంద సంస్థను ఆశ్రయించింది. స్పందించిన ఫౌండేషన్ విజయవాడ సిటీ పోలీస్ తరుపున రూ.10 వేలు నగదును సింగ్‌నగర్ ఉమెన్ సబ్ ఇన్‌స్పెక్టర్ లక్ష్మీ ప్రసన్న, సంస్థ గ్రూప్ సభ్యులు కానిస్టేబుల్ చందు, హోంగార్డ్ ప్రసాద్ ద్వారా సోమవారం సౌమ్య చదువుకుంటున్న పాఠశాలకు వెళ్లి అందజేశారు. ఈ సందర్భంగా సౌమ్య మాట్లాడుతూ బాగా చదుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించే తనలాంటి పేద విద్యార్థులకు చేయూతనిస్తూ ప్రోత్సహిస్తున్న దీవెన ఫౌండేషన్ గ్రూప్ సభ్యులకు రుణపడి ఉంటానని చెప్పింది.

విద్యార్థులకు సామగ్రి పంపిణీ

మధురానగర్(విజయవాడసెంట్రల్): దుర్గాపురానికి చెందిన డాక్టర్ బ్రహ్మదేశం సోషల్ సర్వీస్ సొసైటీ ఆధ్వర్యాన సోమవారం జక్కంపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు విద్యా సామగ్రి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సొసైటీ అధ్యక్షుడు బి.వసంతకుమార్ మాట్లాడుతూ.. నిరుపేద, పేద విద్యార్థులకు తమ వంతు సాయంగా జామెంట్రీ బాక్స్‌లు, విద్యా సామగ్రి అందజేస్తున్నామన్నారు. విద్యార్థులు అవకాశాలను అందిపుచ్చుకుని జీవితంలో నిర్దేశించుకున్న లక్ష్యాలు చేరుకోవాలని సూచించారు. హెచ్ఎం పద్మ మాట్లాడుతూ.. తమ పాఠశాల విద్యార్థులకు విద్యా సామగ్రి అందజేసిన ట్రస్ట్ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం 156 మంది విద్యార్థులకు విద్యా సామగ్రి అందజేశారు. ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి కె.రాము, కోశాధికారి గుర్రం ఏడుకొండలు, లయన్స్ క్లబ్ సభ్యులు బోడి ఆంజనేయరాజు, వీరంకి గోకర్ణేశ్వరరావు పాల్గొన్నారు.

ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు 36 ఫిర్యాదులు


నగర వాసుల నుంచి ఫిర్యాదులను స్వీకరిస్తున్న వీఎంసీ అడిషనల్ కమిషనర్ డాక్టర్ మహేష్, అధికారులు

వీఎంసీలో ఫిర్యాదులు స్వీకరించిన అడిషనల్ కమిషనర్ మహేష్

పటమట(విజయవాడతూర్పు): ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో అందుకున్న ప్రతి ఫిర్యాదును మూడు సర్కిల్‌లో ఉన్న జోనల్ కమిషనర్లు తమ తమ పరిధిలో నుంచి వచ్చిన ఫిర్యాదులను క్షేత్రస్థాయిలో పరిశీలించి సమస్యలను పరిష్కరించాలని విజయవాడ నగరపాలక సంస్థ అడిషనల్ కమిషనర్(జనరల్) డాక్టర్ మహేష్ ఆదేశించారు. వీఎంసీ ప్రధాన కార్యాలయంలోని కమాన్ కంట్రోల్ రూమ్‌లో సోమవారం ఆయన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో 36 ఫిర్యాదులను స్వీకరించారు.

వెంటనే సమస్యలు పరిష్కరించాలి..

ఈ సందర్భంగా ఏసీ మహేష్ మాట్లాడుతూ.. ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను వెంటనే పరిష్కరించేలా అధికారులు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. కార్యక్రమంలో పట్టణ ప్రణాళిక విభాగంపై – 15, ఇంజినీరింగ్ – 8, ఎస్టాబ్లిష్‌మెంట్ – 3, రెవెన్యూ, జేడీ అమృత్, వీఏఎస్, ప్రజారోగ్యం 2, యూసీడీ, హార్టికల్చర్ విభాగాలపై ఒక్కో ఫిర్యాదులు వచ్చాయి. కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్(ప్రాజెక్ట్స్) కేవీ సత్యవతి, చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ పి.రత్నావళి, చీఫ్ ఇంజనీర్ ఎం.ప్రభాకర్ రావు, చీఫ్ సిటీ ప్లానర్ జీవీజీఎస్వీ ప్రసాద్, డెప్యూటీ డైరెక్టర్ హార్టికల్చర్ రామ్మోహన్, డీఎఫ్ఓ, డైరెక్టర్ ఆఫ్ స్పోర్ట్స్ మాల్యాద్రి, వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ బి.సోమశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నదీ జలాల పునఃపంపిణీలో రాష్ట్ర హక్కులను కాపాడాలి

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): కృష్ణా, గోదావరి నదీ జలాల పునఃపంపిణీ ద్వారా మన రాష్ట్ర నీటి హక్కులను కాపాడాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఈ మేరకు ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సోమవారం జిల్లా రెవెన్యూ ఆఫీసర్ శ్రీనివాసరావుకు ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో ఏపీ కౌలురైతుల సంఘం ప్రధాన కార్యదర్శి పి.జమలయ్య, ఏపీ రైతు సంఘం ఉపాధ్యక్షుడు మల్నీడు యల్లమందారావు, ఏపీ కౌలురైతుల సంఘం జిల్లా అధ్యక్షుడు బుడ్డి రమేష్, ఉపాధ్యక్షుడు పెయ్యల వెంకటేశ్వరరావు, జిల్లా రైతుసంఘం నాయకుడు జి.దేవరాజు, పర్చూరి అజయ్, చెరుకూరి కుటుంబారావు, గుంజె వెంకయ్య తదితరులు పాల్గొని వినతిపత్రం అందజేశారు. వినతిపత్రాన్ని సీఎం చంద్రబాబుకు పంపించి బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్‌కు నివేదించాలని కోరారు.

ప్రత్యేక ట్రిబ్యునల్ ఏర్పాటు చేయాలి..

ఆంధ్రప్రదేశ్ విభజన చట్టం – 2014, గత ట్రిబ్యునల్ తుది ఉత్తర్వులకు వ్యతిరేకంగా ఏ విధమైన అనుమతులు లేకుండా తెలంగాణ ప్రభుత్వం నిర్మిస్తున్న, నిర్మించాలని తలపెట్టిన ప్రాజెక్టులపై చర్యలు తీసుకోవాలన్నారు. ముఖ్యంగా పాలమూరు- రంగారెడ్డి ఎత్తిపోతల పథకం, దిండి ప్రాజెక్టు, కల్వకుర్తి ఎత్తిపోతల పథకం వంటి ప్రాజెక్టుల వలన రాష్ట్రానికి జరిగే నష్టాన్ని ట్రిబ్యునల్ దృష్టికి తీసుకెళ్లాలని విజ్ఞప్తి చేశారు. నాగార్జునసాగర్ ఎడమ కాలువ నుంచి రాష్ట్రానికి వాటాగా రావాల్సిన నీరు రాకపోవడం వలన 3, 4 జోన్లకు నీరు అందక రైతులు నష్టపోతున్నారని వినతి పత్రంలో పేర్కొన్నారు. గోదావరి నది నీటి పంపిణీ విషయం చర్చించేందుకు ఉభయ రాష్ట్రాల మధ్య ప్రత్యేక ట్రిబ్యునల్ ఏర్పాటు చేయాలని కోరారు. ప్రతి సంవత్సరం పులిచింతల ప్రాజెక్టులో 30.23 టీఎంసీల నీరు నిలువ ఉండేలా నిర్ణయించి అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. ప్రతి ఏడాది కృష్ణా డెల్టాకు జూన్ నెల మొదటి వారంలో నారుమళ్లు పెంచుకోవడానికి నీటిని విడుదల చేసి డెల్టాలోని కాలువలకు నీరు అందించే విధంగా విధివిధానాలను రూపొందించాలని కోరారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రత్యేక చొరవ తీసుకొని పై అంశాలను చర్చించేందుకు రాజకీయ పార్టీలు, రైతు సంఘాలు, సాగునీటి రంగనిపుణులతో సమావేశం నిర్వహించాలని వినతి పత్రంలో కోరారు.

కరాటే పోటీల్లో విజేతలకు అభినందన



భవానీపురం(విజయవాడపశ్చిమ): జాతీయ ఓపెన్ కరాటే చాంపియన్‌షిప్ – 2024 పోటీల్లో జె.కె.గోజురియో కరాటే అకాడమీ(గొల్లపూడి) సత్యనారాయణపురం బ్రాంచి విద్యార్థులు ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచారు. ఈ నెల 4న విశాఖపట్నం గాజువాకలోని అగ్నికుల క్షత్రియ కళాక్షేత్రంలో నిర్వహించిన థర్డ్ నేషనల్ ఓపెన్ కరాటే చాంపియన్‌షిప్ టోర్నమెంట్‌లో పాల్గొన్న విద్యార్థుల్లో బి.ఆధ్యశ్రీ(ప్రథమ), కె.భవితరెడ్డి(ప్రథమ), బి.హిమ శ్రీ, కె.లీలా కృష్ణ, బి.సాయి అక్షయ ద్వితీయ స్థానాల్లో నిలిచారు. ఈ సందర్భంగా సోమవారం నిర్వహించిన అభినందన కార్యక్రమంలో సత్యనారాయణపురం బ్రాంచి హెడ్ కోచ్ పి.హర్ష విజేతలను అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ టోర్నమెంట్‌లో బహుమతులు సాధించడం ముఖ్యం కాదని, పాల్గొనటమే ప్రధానమని పేర్కొన్నారు. అందునా జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొని విజయం సాధించటం అభినందనీయమని చెప్పారు. భవిష్యత్‌లో జాతీయ, అంతర్జాతీయ స్థాయి టోర్నమెంట్స్‌లో పాల్గొని గోల్డ్ మెడల్స్ సాధించాలని ఆకాంక్షించారు. విజేతలను అభినందించిన వారిలో అకాడమీ వ్యవస్థాపకుడు జె శ్రీనివాసులు, టెక్నికల్ డైరెక్టర్ జె.హరనాథ్ ఉన్నారు.

కరాటేతో యువతకు ఆత్మరక్షణ

మధురానగర్(విజయవాడసెంట్రల్): విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లో ప్రావీణ్యం పెంచుకోవాలని, కరాటేతో ఆత్మరక్షణ లభిస్తుందని శ్రీచైతన్య కళాశాల ప్రిన్సిపాల్ ఎన్ గోకర్ణేశ్వరరావు, డీన్ హరిబాబు అన్నారు. స్థానిక ఏలూరు రోడ్డు చుట్టుగుంట శ్రీ చైతన్య కళాశాలలో సోమవారం కరాటే పోటీల్లో బంగారు పతకం సాధించిన విద్యార్థి సంతోష్‌సింగ్ రాజ్ పురోహిత్ అభినందన కార్యక్రమం జరిగింది. తమ కళాశాల విద్యార్థి సంతోష్‌సింగ్‌రాజ్ పురోహిత్ విశాఖపట్నంలో జరిగిన 3వ జాతీయ ఓపెన్ కరాటే చాంపియన్‌షిప్‌లో బంగారు పతకంతో పాటు కాంస్య పతకం సాధించటం కళాశాలకే గర్వకారణమన్నారు. ఇదే స్ఫూర్తితో మరిన్ని పతకాలు సాధించాలని ఆకాంక్షించారు. అనంతరం విద్యార్థిని ఘనంగా సత్కరించారు.

లక్ష్యసాధనకు నిరంతర శ్రమ అవసరం


మాట్లాడుతున్న కాలేజీ పాలకవర్గ అధ్యక్షుడు మల్లికార్జునరావు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): విద్యార్థులు తమ లక్ష్యసాధనకు నిరంతరం శ్రమించాలని చలవాది మల్లికార్జునరావు కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ పాలకవర్గ అధ్యక్షుడు చలవాది మల్లికార్జునరావు అన్నారు. బీటెక్ మొదటి ఏడాది విద్యార్థులకు తరగతులు ప్రారంభం, పరిచయ కార్యక్రమాలను ఆ కళాశాల సెమినార్ హాల్‌లో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన చలవాది మల్లికార్జునరావు మాట్లాడుతూ.. జీవితంలో విద్యార్థి దశ చాలా కీలకమైనదన్నారు. విద్యార్థిగా ఎంత కష్టపడితే అంత ఉన్నత స్థాయికి ఎదగటానికి అవకాశముంటుందని చెప్పారు. ఇంజినీరింగ్ కోర్సుల్లో చేరిన విద్యార్థులు మంచి స్థాయికి ఎదగటానికి తమను తాము ఉత్తమంగా తీర్చిదిద్దుకోవటానికి కృషి చేయాలని సూచించారు. మారుతున్న కాలానుగుణంగా విద్యార్థులు పోటీ పడాలన్నారు. ఆ దిశగా విద్యార్థులను తీర్చిదిద్దటానికి తమ కళాశాల యజమాన్యం నిరంతరం బాసటగా నిలుస్తుందన్నారు. కళాశాల కార్యదర్శి చిట్టా అమర్‌సుధీర్ మాట్లాడుతూ.. విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి తమ కళాశాల నిరంతరం కృషి చేస్తుందన్నారు. విద్యార్థుల అభివృద్ధికి అవసరమయ్యే వివిధ కార్యక్రమాలను నిర్వహిస్తామన్నారు. వాటిని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అలాగే ప్రతి విద్యార్థి ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకొని బయటకు వెళ్లాలని సూచించారు. ఆ దిశగా పాటుపడాలని కోరారు. కార్యక్రమంలో కళాశాల కోశాధికారి కె.రాఘవయ్య, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ పతంజలిశాస్త్రి, అధ్యాపకులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఓపెన్ జిమ్‌కు మళ్లీ మళ్లీ ప్రారంభోత్సవం


పార్కులో ఓపెన్ జిమ్‌ను ప్రారంభిస్తున్న మేయర్ రాయన భాగ్యలక్ష్మి(ఫైల్)


సోమవారం పార్కులో జిమ్‌ను ప్రారంభిస్తున్న మంత్రి నారాయణ, ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్

పటమట(విజయవాడతూర్పు): గత ప్రభుత్వంలో అభివృద్ధి చేసి ప్రారంభోత్సవం చేసిన ఓపెన్ జిమ్‌ను మళ్లీ ఈ ప్రభుత్వంలో ప్రారంభించడం నగరంలో చర్చనీయాంశంగా మారింది. నాలుగో డివిజన్‌లో ఉన్న వెటర్నరీ కాలనీలో కాలనీ అభివృద్ధి కమిటీ అభ్యర్థన మేరకు వైఎస్సార్ సీపీ విజయవాడ తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జి దేవినేని అవినాష్ ఆధ్వర్యంలో పార్కు అభివృద్ధికి గతంలో రూ.60 లక్షలు వెచ్చించారు. కాలనీలోని కమ్యూనిటీ హాలు, పార్కును, చిన్నారులు ఆడుకునేందుకు పరికరాలను, కాలనీ వాసుల కోసం ఓపెన్‌జిమ్‌ను 2022 జనవరి 11వ తేదీన ప్రారంభించారు. వీఎంసీ మేయర్ రాయన భాగ్యలక్ష్మి, అప్పటి కమిషనర్ ప్రసన్న వెంకటేష్ ముఖ్యఅతిథులుగా హాజరై కాలనీ పెద్దల సమక్షంలో పార్కు ప్రారంభించారు. ప్రస్తుతం పార్కులో జిమ్‌ను సోమవారం రాష్ట్ర పురపాలక శాఖమంత్రి నారాయణ, స్థానిక ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ ఆర్భాటంగా ప్రారంభించారు. మంత్రి నారాయణ మాట్లాడుతూ మున్సిపాలిటీల్లో పార్కులు, వాకింగ్‌ట్రాక్‌లు, గ్రీనరీ అభివృద్ధి చేయటానికి ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని చెప్పారు. కార్యక్రమానికి హాజరైన కాలనీ పెద్దలు ఒకే పార్కును ఎన్ని సార్లు ప్రారంభిస్తారని చర్చించుకున్నారు.

నిరుపయోగంగా ఫౌంటెన్లు


బైనేని జంక్షన్‌లో ఉన్న ఫౌంటెన్


రమేష్ ఆస్పత్రి జంక్షన్‌లోని ఫౌంటెన్


బెంజిసర్కిల్‌లోని ఫౌంటెన్ నిల్వ ఉన్న నీరు, చెత్త

విజయవాడ నగరాన్ని సుందరంగా తీర్చిదిద్దేందుకు పలు జంక్షన్లల్లో కార్పొరేషన్ ఆధ్వర్యంలో గతేడాది వాటర్ ఫౌంటెన్లను నిర్మించారు. బెంజిసర్కిల్ నుంచి రామవరప్పాడు జంక్షన్ వరకు వెళ్లే జాతీయ రహదారికి సర్వీస్ రోడ్డుకు మధ్యలో ఫ్లై ఓవర్ కింద మొత్తం ఐదు వాటర్ ఫౌంటెన్లను ఏర్పాటు చేశారు. వీటి నిర్మాణం పూర్తి అయిన తర్వాత కొంత కాలం నీరు విరజిమ్ముతూ నగర వాసులకు ఆహ్లాదాన్ని అందించాయి. ప్రస్తుతం వీటి నిర్వహణపై కార్పొరేషన్ దృష్టి పెట్టకపోవడంతో నిరుపయోగంగా మారాయి. ఈ ఫౌంటెన్ల కోసం నిర్మాణం చేసిన నీటి ట్యాంక్‌లో నీరు నిల్వ ఉండటంతో అపరిశుభ్ర వాతావరణం ఏర్పడి పరిసర ప్రాంతాల్లో దుర్వాసన వెదజల్లుతున్నాయి. అంతే కాకుండా ఆ ఫౌంటెన్లు దోమలకు నిలయాలుగా మారాయి. విలువైన ప్రజాధనంతో వెచ్చించి నిర్మాణం చేసిన ఈ వాటర్ ఫౌంటెన్లను వినియోగంలోకి తీసుకురావాలని నగర వాసులు కోరుతున్నారు.

–మొగల్రాజపురం (విజయవాడ తూర్పు)

సంప్రదాయ కళలను పరిరక్షించుకోవాలి


నాట్యాచారిణి శ్రీదేవిని సత్కరిస్తున్న నిర్వాహకులు

విజయవాడ కల్చరల్: సంప్రదాయ కళలను పరిరక్షించుకోవాలని సంగీత విద్వాంసుడు కేవీ బ్రహ్మానందరావు చెప్పారు. తెలుగు కళావాహిని, శ్రీ కళాభారతి, సంగీత సమ్రాట్ కళాసంస్థ, కేవీ బ్రహ్మానందరావు కళావేదిక ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని కౌతా పూర్ణానందం కళావేదికపై సోమవారం తిరుపతికి చెందిన కళాకారుల భరత నాట్య ప్రదర్శన, నాట్యాచారిణి కే శ్రీదేవికి ఆత్మీయ సత్కారం, సినీ సంగీత విభావరి కార్యక్రమం నిర్వహించారు.

కళాకారులు సాంస్కృతిక వారధులు

ముఖ్య అతిథిగా పాల్గొన్న బ్రహ్మానందరావు మాట్లాడుతూ.. కళాకారులు సాంస్కృతిక వారధులని, వారి సేవలను గుర్తించి ప్రోత్సహించాలని చెప్పారు. శ్రీ కళాభారతి వ్యవస్థాపకుడు శింగంశెట్టి చంద్రశేఖర్ మాట్లాడుతూ.. కళా సంస్థలు ప్రజా సేవలో భాగస్వాములు కావాలని సూచించారు. తెలుగు కళావాహిని అధ్యక్షుడు చింతకాయల చిట్టిబాబు ఆధ్వర్యంలో నాట్యాచారిణి శ్రీదేవి దంపతులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఆకాశవాణి విశ్రాంత కార్యక్రమ నిర్వాహకుడు ఏబీ ఆనంద్, బోడి ఆంజనేయరాజు, డేవిడ్‌రాజు పాల్గొన్నారు. గాయనీ గాయకులు పలు చిత్ర గీతాలను ఆలపించారు.